● అమల్లోకి రానున్న నూతన ఎక్సైజ్ విధానం

● మద్యంప్రియుల ఎదురుచూపు



సరుకు రావాల్సిందే..!

నంద్యాల రూరల్, సెప్టెంబరు 22: కొత్త మద్యం విధానం కోసం అందరూ ఎదురు చూస్తున్నారు. పాత తరహాలో తాము కోరుకుంటున్న సరుకు కోసం ఎదురు చూస్తున్నారు. మద్యం దుకాణాలను చేజిక్కించుకునేందుకు ఎన్నడూ బయటకు రాని వ్యక్తులు ఈసారి ప్రత్యక్షమయ్యే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ రంగంలో ఆరితేరిన వారంతా ఈ విషయంలో అమీతుమీ తేల్చుకోవాలని ఉన్నారు. జగన్ సర్కార్ ప్రవేశపెట్టిన మాల్స్‌లో సరుకు క్రమేపీ తగ్గించారు. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో కొన్ని మాత్రమే అందుబాటులో ఉంచుతున్నారు. ఇప్పుడు ఎవరిని కదిపినా గత టీడీపీ హయాంలో ఉన్న విధానమే తిరిగి రాబోతోందని ఊహాగానాలు వ్యక్తం చేస్తున్నారు. మరో రెండు వారాల్లో కొత్త మద్యం విధానం రాష్ట్ర ప్రభుత్వం తీసుకు రానుంది. మద్యం ప్రియులంతా ఈ విధానంపైనే ఎదురు చూస్తున్నారు. తాము ఆశించినట్లు 2019కి ముందున్న మద్యం సరుకు అంతా తిరిగి మార్కెట్లోకి వస్తుందన్న ఆశావహ దృక్పథంతో ఉన్నారు. ప్రభుత్వ ఆదాయం పెంచుకునే విధంగా మద్యం దుకాణాలు పెంచాలన్న ఆలోచన ఉన్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్ వ్యక్తులు దుకాణాలు ఏర్పాటు చేస్తే రోజుకు రూ.6 కోట్ల వరకు విక్రయాలు జరిగే అవకాశం ఉంది. సూపర్‌బజార్‌ను తలపించే మాల్స్‌కు శ్రీకారం చుట్టి అమ్మకాల ఒరవడిని పెంచింది. కొత్త మద్యం విధానంలో ఈ మాల్స్‌కు మంగళం పాడబోతున్నట్లు సమాచారం. అందుకు తగ్గట్టుగానే 45 రోజులుగా మాల్స్‌లో ఇంతకు ముందున్న సరుకు విడుదలను ఈ మధ్యన పూర్తిగా తగ్గించేశారు.

ఈ సారి రూ.2 లక్షల ధరావత్తు

జగన్ హయాంలో మద్యపాన నిషేధం పేరిట హడావిడి చేసి చివరకు ఎడాపెడా రకరకాల బ్రాండ్లను మార్కెట్లోకి తీసుకొచ్చారు. ఏరోజుకారోజు కష్టపడి కూలీనాలి చేసుకునే వారికి రకరకాల మద్యం అంటగట్టారు. నాసిరకం మద్యంతో అనారోగ్యానికి గురవడం, ప్రాణాలు కోల్పోయిన ఘటనలు జరిగాయి. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త మద్యం పాలసీలో ఎక్కడికక్కడ దుకాణాల సంఖ్యను పెంచనున్నారు. ప్రభుత్వం నిర్వహించే వేలం పాటల్లో దక్కించుకున్న ప్రైవేట్ వ్యక్తులు మద్యం దుకాణాలు నిర్వహిస్తారు. అయితే గతంలో మద్యం దుకాణాలకు నిర్వహించే వేలంలో నాన్ రీఫండ్ పేరిట ప్రతి దుకాణానికి రూ.లక్ష ఉండగా ఈసారి అది రూ.2 లక్షలకు పెంచబోతున్నారు. ఎవరైతే వేలంపాటలో పాల్గొంటారో వారంతా ప్రభుత్వం నిర్దేశించిన ధరావత్తును విధిగా చెల్లించాలి. దుకాణం దక్కినా, దక్కకపోయినా ఈ ధరావత్తు సొమ్ము ప్రభుత్వ ఖాతాలోనే జమ అవుతుంది. సరిగ్గా ఆ విధానాన్నే ఈసారి పాటించబోతున్నట్లు సమాచారం. జగన్ హయాంలో ఎవరూ చూడని, వినని దాదాపు 22 రకాల బ్రాండ్లన్నీ వచ్చి పడ్డాయి. ఇప్పుడవన్నీ కనుమరుగు కానున్నాయి. ఆ స్థానంలో అందరూ కోరుకునే బ్రాండ్లకే ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.

మళ్లీ పాత రోజులు

కొత్త మద్యం విధానంపై వ్యాపారులే కాకుండా సాధారణ జనం తెగ టెన్షన్ పడుతున్నారు. జగన్ హయాంలో కొన్ని బ్రాండ్లు పూర్తిగా అదృశ్యమైన విషయాన్ని గుర్తు చేస్తూనే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాతైనా అందరూ ఆశించినట్లుగా పాత బ్రాండ్లు మళ్లీ తెరపైకి వస్తాయన్న భావనతో ఎదురు చూస్తున్నారు. ఇంతకుముందు కనపడని ఇంపీరియల్ బ్లూ, ఎంసీ విస్కీ, తదితర రకాలన్నీ ఇప్పటికే స్టాక్ పాయింట్లకు చేరుకున్నాయి.



కొత్త ముఖాల ఆత్రుత

కొత్త మద్యం విధానం ఇప్పటి వరకు ప్రకటించకపోయినా త్వరలో ప్రభుత్వం రూపకల్పన చేయనుంది. మద్యం వ్యాపారంతో ఈసారి రంగంలోకి దిగి దుకాణాలను చేజిక్కించుకోవాలని ఆత్రుతగా ఉన్నారు. ఇంతకుముందు ఒక సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులే మద్యం వ్యాపారంలో పెట్టుబడిపెట్టేవారు. ఈ సారి అలాంటి వారికి దీటుగా ఐదు నుంచి పదిమంది వరకు సిండికేట్‌గా మారి తమ ప్రాంతంలో దుకాణాల వేలంలో పాల్గొనాలని భావిస్తున్నారు. జిల్లాలోని కొన్ని నియోజకవర్గాల్లో దుకాణాలను తమ ఆధీనంలోనే ఉండేలా ఇప్పటికే ఎత్తుగడలు వేస్తున్నారు. స్థానిక ఎమ్మెల్యేతో పని లేకుండా ముందుగానే రంగంలోకి దిగి ఆ తర్వాతే ఎమ్మెల్యేతోపాటు ఇతర నేతలను సంప్రదించాలని భావిస్తున్నారు. జిల్లాతోపాటు జిల్లా కేంద్రంలో దుకాణాల సంఖ్య ఈసారి పెరిగే అవకాశం ఉన్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఆ దిశగానే రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఇంకొందరు సిండికేట్‌గా మారి ప్రతి షాప్‌లో తమ వాటా ఉండేలా ఎత్తుగడ వేస్తున్నారు.



అభివృద్ధికి బాటలు వేస్తున్నాం

మంత్రి ఎన్ఎండీ ఫరూక్




మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ప్రసంగిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 22: వంద రోజుల పాలన దిగ్విజయంగా ముగించుకొని అభివృద్ధికి బాటలు వేసుకుంటూ ముందుకుపోతున్నామని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. ఆదివారం నంద్యాలలో రెండో వార్డు చింతరుగు వద్ద రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ పట్టణాలు, గ్రామీణ వ్యవస్థలు నిర్వీర్యమవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం వాటిని బలోపేతం చేసి అభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రజల్లోకి వెళ్లి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు. కూటమి అధికారంలోకి రాగానే పింఛన్ సొమ్ము రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచడం, దివ్యాంగులకైతే రెండింతలు చేశామని చెప్పారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్టును రద్దు చేయడంతోపాటు 16,437 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశామని తెలిపారు. అలాగే అన్న క్యాంటీన్లను పునరుద్ధరించి ఐదు రూపాయలకే టిఫిన్, భోజనం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, రాజీ పడొద్దని మంత్రి సూచించారు. కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం, లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. వరద బాధితుల కోసం సీఎం పది రోజులు బస్సులోనే ఉండి యంత్రాంగానికి స్ఫూర్తినిచ్చారన్నారు. ప్రకృతి విపత్తును ఎదుర్కోవడంలో యంత్రాంగం సమర్థవంతంగా పని చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నంద్యాల ఆర్డీఓ మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నిరంజన్‌రెడ్డి, కౌన్సిలర్ నాగార్జున, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా విజ్ఞప్తుల స్వీకరణ
కలెక్టర్ రాజకుమారి

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 22: నంద్యాల కలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార విధానం ద్వారా అర్జీలు స్వీకరించనున్నట్లు కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే ప్రక్రియను పబ్లిక్ గ్రీవియన్స్ రెడ్రస్సల్ సిస్టం (పీజీఆర్ఎస్) ద్వారా చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించే పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఆ నెల 23వ తేదీ ఉదయం 9.30 గంటలకు జిల్లా అధికారులందరూ హాజరు కావాలని కలెక్టర్ కోరారు. అలాగే జిల్లా కేంద్రంతో పాటు మండల, నియోజకవర్గ, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

శ్రీశైలానికి 15,487 క్యూసెక్కులు



శ్రీశైలం, సెప్టెంబర్ 22: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి ఆదివారం వరద ప్రవాహం స్వల్పంగా కొనసాగింది. జూరాల నుంచి 15,487 క్యూసెక్కుల వరద నీరు వస్తున్నది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 876.30 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీ.ఎమ్.సీ లు కాగా ప్రస్తుత నీటి నిల్వ 169.4655 టీ.ఎమ్.సీ లుగా నమోదయింది. తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37,116 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి నిలుపుదల చేశారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ



శ్రీశైలం, సెప్టెంబరు 22: శ్రీశైలం మహాక్షేత్రానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. వేకువజాము నుంచే అధిక సంఖ్యలో భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించి, కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి, అమ్మవార్ల దర్శనార్థం భక్తులు బారులు తీరారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు ఆలయ అధికారులు తాగునీరు, అల్పాహారం అందజేశారు. క్షేత్రపరిధిలోని సత్ర సముదాయాలు భక్తులతో కిక్కిరిసాయి.



కొత్తూరులో న్యాయాధికారి పూజలు



న్యాయాధికారిని సత్కరించిన ఆలయ సిబ్బంది

పాణ్యం, సెప్టెంబరు 22: మండలంలోని కొత్తూరు దేవస్థానంలో ఆదివారం కర్నూలు జిల్లా న్యాయాధికారి జి.కబర్ది పూజలు నిర్వహించారు. న్యాయాధికారికి ఆలయ సిబ్బంది ఆలయ మర్యాదల తో స్వాగతం పలికి సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి, నాగలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ సిబ్బంది న్యాయాధికారిని శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సుబ్బారెడ్డి, ఏఎస్ఐ రఫీక్, అర్చకులు నారాయణ స్వామి, సురేష్ శర్మ, పోలీసు సిబ్బంది. నంద్యాల కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్ సీజన్‌కే బీమా

● రబీ నుంచి ప్రీమియం చెల్లించాల్సిందే

● ఇదేమి దారుణమంటున్న రైతు సంఘాలు

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 22: రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు సాగు చేసిన పంటలకు ఉచిత పంటల బీమా పథకాన్ని అమలు చేస్తోంది. ఈ సంవత్సరం ఖరీఫ్‌లో సాగు చేస్తున్న వివిధ పంటలకు సంబంధించి ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. నోటిఫై చేసిన పంటలు ఈ-క్రాప్‌లో నమోదు చేసి ఈకేవైసీ చేయించుకుంటేనే ఉచిత పంటల బీమా వర్తిస్తుందని, పంట కోత ప్రయోగాల ఆధారంగా పరిహారం లభిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. వరికి హెక్టారుకు రూ.లక్ష బీమాను ఖరారు చేశారు. వాతావరణ ఆధారిత బీమా కింద కర్నూలు, నంద్యాల జిల్లాలో పత్తి, వేరుశనగలను నోటిఫై చేశారు. కర్నూలు జిల్లాలో గ్రామం యూనిట్‌గా వరిని, మండలం యూనిట్‌గా కంది, ఎండుమిర్చి, జొన్న, ఆముదం పంటలను గుర్తించారు. నంద్యాల జిల్లాలో బీమా అమలును గ్రామం యూనిట్ వరిని, మండల యూనిట్‌ను మొక్కజొన్న, కంది, మినుము, ఎండు మిర్చిని గుర్తించినట్లు జేడీ వరలక్ష్మి తెలిపారు.

● **రైతు సంఘాలు ధ్వజం:** పంటల బీమా పథకంలో రైతులు చెల్లించాల్సిన ప్రీమియాన్ని ఖరీఫ్ పంటలకే వర్తింపజేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై జిల్లా రైతు సంఘం కార్యదర్శి రామకృష్ణ ధ్వజమెత్తారు. రబీలో రైతులు సాగు చేయనున్న పంటలకు రైతులు ప్రీమియాన్ని ప్రభుత్వం చెల్లించదని, రైతులే చెల్లించుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొనడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు దశాబ్ద కాలంగా రైతులు ఉమ్మడి జిల్లాలో ప్రకృతి వైపరీత్యాలు తెగుళ్ల కారణంగా పంటలు కోల్పోయారని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం ఖరీఫ్ సీజన్ వరకే రైతుల తరుపున ప్రీమియం చెల్లిస్తామని ప్రకటించడం దారుణమని అన్నారు.



శాపాలుగా మారిన
వైసీపీ పాపాలు

● నెలలో పది రోజులు రాయలసీమలో ఉంటా

● వచ్చే సీజన్ నాటికి హంద్రీనీవా ప్రధాన కాలువ విస్తరణ పూర్తి చేస్తాం

● హెచ్ఎన్ఎస్ఎస్ ఎత్తిపోతల పథకాన్ని సందర్శించిన జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు



నదీ జలాలకు పూజలు నిర్వహిస్తున్నమంత్రి నిమ్మల రామానాయుడు, ఎమ్మెల్యేలు

నందికొట్కూరు/ నందికొట్కూరు రూరల్, సెప్టెంబరు 22: రాయలసీమకు వైసీపీ చేసిన పాపాలు నేడు శాపాలుగా మారాయని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆదివారం హంద్రీనీవా సుజల స్రవంతి పథకాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబులు మంత్రికి నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం మల్యాల గ్రామం వద్ద ఘనస్వాగతం పలికారు. మంత్రి హెచ్.ఎన్.ఎస్.ఎస్ ప్రాజెక్టును పరిశీలించాక కృష్ణానదికి జలహారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాయలసీమను రత్నాల సీమగా తీర్చిదిద్దేందుకు టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారకరామారావు మొదలుకొని నేటి ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు వరకు ఎన్నో సాగునీటి ప్రాజెక్టులను తీసుకొచ్చారన్నారు. తెలుగు గంగ, గాలేరు నగరి, హెచ్ఎన్ఎస్ఎస్. ఎస్ఆర్‌బీసీ, వంటి ప్రాజెక్టులతో రాయలసీమను సస్య శ్యామలం చేశారన్నారు. మల్యాల వద్ద హంద్రీ నీవా ద్వారా కర్నూలు, కడప, అనంతరం, చిత్తూరు నాలుగు ఉమ్మడి జిల్లాలకు తాగు, సాగునీరు అందించేందుకు 8 పంపింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేసి 700 కిలోమీటర్ల కాలువ ద్వారా సాగునీరు అందిస్తున్నామని అన్నారు. అయితే హెచ్.ఎన్.ఎస్.ఎస్ 12 పంపుల ద్వారా 3,850 క్యూసెక్కుల సామర్థ్యం కాగా గత ఐదు సంవత్సరాల వైసీపీ నిర్వాకం వల్ల 1900 క్యూసెక్కులు మాత్రమే నీరు వెళ్తోందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం హంద్రీనీవా పనులను పక్కన పెట్టడంతోనే ఈ దుస్థితి ఏర్పడిందన్నారు. హంద్రీ నీవాకు జగన్ చేసిన పాపాలు రాయలసీమకు శాపాలుగా మారాయన్నారు. వచ్చే సీజన్ నాటికి గత ఐదేళ్ల నిర్లక్ష్యం, నిర్లిప్తతను సరిచేసి పూర్తి సామర్థ్యంతో నీరు వెళ్లే విధంగా విస్తరణ పనులు చేపడతామన్నారు. హంద్రీ నీవా ప్రధాన కాలువ విస్తరణ పనులను వచ్చే సీజన్ నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నామన్నారు. అందులో భాగంగానే రెం డు రోజుల పాటు హంద్రీనీవా కాలువను మల్యాల నుంచి అనంతపురం వరకు పరిశీలిస్తున్నామన్నారు.

● టీడీపీతోనే సీమ అభివృద్ధి: టీడీపీ హయాంలో రాయలసీమ అభివృద్ధి జరిగితే... వైసీపీ పాలనలో సీమకు తీరని అన్యాయం జరిగిందన్నారు. 2014-2019 వరకు రాష్ట్ర బడ్జెట్ రూ.7 లక్షల కోట్లు ఉంటే అందులో రూ.72 వేల కోట్ల రూపాయలను ఇరిగేషన్ ప్రాజెక్టులకు కేటాయించామన్నారు. గత ఐదేళ్లలో జగన్మోహన్‌రెడ్డి రాష్ట్ర బడ్జెట్ రూ.12 లక్షల కోట్లు ప్రవేశపెడితే రూ.49 వేల కోట్లు మాత్రమే కేటాయించారని, అందులోను రూ.31 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని అన్నారు. ఖర్చు చేసిన నగదులో నగం పైగా నిధులు అవినీతి పాలయ్యాయని ఆయన ఆరోపించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో ఏ ఒక్క ప్రాజెక్టుకు కూడా తట్టెడు మట్టి వేసి మరమ్మతు చేసిన పాపాన వైసీపీ ప్రభుత్వం పోలేదన్నారు. కనీసం గేట్లకు గ్రీజు కూడా పెట్టలేని దుస్థితిలో గత ప్రభుత్వ పాలన సాగిందన్నారు. సాగునీటి ప్రాజెక్టులన్నా, వ్యవసాయమన్నా, రైతులన్నా వైసీపీ ప్రభుత్వానికి ఏపాటి చిత్తశుద్ధి ఉందో ఇట్టే అర్థమవుతోందని అన్నారు. నాడు ఉన్న రాక్షస ప్రభుత్వానికి, నేడు ఉన్న ఎన్.డీ.ఏ ప్రజా ప్రభుత్వ పాలనను ప్రజలు గమనించాలన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను నేడు ఉన్న ప్రజా ప్రభుత్వం సరి చేస్తూ ప్రజలను కాపాడేందుకు ముందుంటుందన్నారు. రాయలసీమ బిడ్డను అని చెప్పుకునే నైతిక హక్కు జగన్మోహన్‌రెడ్డికి లేదని ఆయన అన్నారు. 2014-19 మధ్యలో టీడీపీ రాయలసీమకు సంబంధించిన ఇరిగేషన్ ప్రాజెక్టులకు రూ.12,441 కోట్లు కేటాయించి ఖర్చు చేస్తే... గత ఐదేళ్లలో వైసీపీ రూ.2011 కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. హంద్రీనీవాకు టీడీపీ రూ. 4,122 కోట్లు కేటాయిస్తే... వైసీపీలో రూ.515 కోట్లు మాత్రమే కేటాయించిందన్నారు. టీడీపీ హయాంలో హంద్రీ నీవా ఫేజ్-1లో 84 శాతం, ఫేజ్-2లో 75శాతం పనులను పూర్తి చేస్తే... మిగిలిన 16శాతం, 25 శాతం పనులు వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందన్నారు. ఎమ్మెల్యేలు జయసూర్య, కేఈ శ్యాంబాబు, తుగ్గలి నాగేంద్ర, ఈఎన్‌సీ వెంకటేశ్వరరావు, ఎస్ఈ రెడ్డి శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి



హంద్రీనీవా ఎత్తిపోతల పథకం మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి

ఇరిగేషన్ శాఖ మంత్రిని కలిసిన నాయకులు



మంత్రి రామానాయుడుకు పుష్పగుచ్చం ఇస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి):ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆదివారం జిల్లా పర్యటనకు వచ్చారు. స్టేట్‌గెస్ట్ హౌస్‌లో ఎమ్మెల్యేలు, జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మిగనూరు, పత్తికొండ, పాణ్యం ఎమ్మెల్యేలతో పాటు మంత్రాలయం, ఆలూరు, కర్నూలు ఎంపీ, నాయకులు కలిసి సమస్యలను వివరించారు. పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ పనులను పూర్తి చేసి, రైతులకు సాగునీరు అందించాలని మంత్రిని కోరారు. అలగనూరు రిజర్వాయర్‌కు మరమ్మతులు, కల్లూరు, ఓర్వకల్లు మండలాల్లో హంద్రీనీవా కాల్వద్వారా చెరువులకు నీళ్ల నింపి ప్రజలు, రైతుల త్రాగు, సాగు నీటి అవసరాలు పరిష్కరించాలని ఎమ్మెల్యే గౌరు చరిత కోరారు.





మంత్రితో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి, రాఘవేంద్ర రెడ్డి











మంత్రి నిమ్మల రామానాయుడిని కలిసిన ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యేలు గౌరు చరిత, కేఈ శ్యాంబాబు, టీడీపీ నాయకుడు తుగ్గలి నాగేంద్ర, కలెక్టర్ రంజిత్‌బాషా, వీరభద్రగౌడ్

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య



రామాంజనేయులు (ఫైల్)

గూడూరు, సెప్టెంబరు 22: అప్పుల బాద తాళలేక పురుగుల మందు తాగి రైతు చిన్న రామాంజనేయులు(37) ఆత్మహత్యకు పాల్పడి ఆసుపత్రిలో కోలుకోలేక శనివారం రాత్రి మృతి చెందాడు. గూడూరు పట్టణం కొండిగేరికి చెందిన రైతు చిన్న రామాంజనేయులుకు భార్య మహాలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. 4 ఎకరాల సొంత పొలంతో పాటు, 5 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి, ఇతర పంటలను సాగు చేస్తున్నాడు. అయితే పంటలు సరిగా పండక దాదాపు రూ. 8లక్షల వరకు అప్పులు చేసాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక మధనపడుతూ ఈ నెల 20వ తేదిన పొలంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యుల కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం మృతి చెందాడు. ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఏఎస్‌ఐ అంజనేయులు తెలిపారు. బాధిత రైతుకు ప్రభుత్వం ఆదుకోవాలని పరిహారం ఇవ్వాలని మాజీ జడ్పీటీసీ ఎల్ వెంకటేశ్వర్లు, జింకల కుమార్ కోరారు.

అప్పుల బాధతో పెయింటర్ ...

కర్నూలు, సెప్టెంబరు 22: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్ద బోయ కర్ణ పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. తెలంగాణ రాష్ట్రం మానవపాడు చెందిన కర్ణ ఏడేళ్ల కింద కుటుంబంతో సహా వచ్చి పెయింటింగ్ పని చేస్తుండేవాడు. ఈయనకు కొడుకు, కూతురు సంతానం ఉన్నారు. పెయింటింగ్ పని కోసం రూ.5 లక్షల మేర అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక తరచూ బాధపడుతుండేవాడు. శనివారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రి 7 గంటల ప్రాంతంలో ఆసుపత్రి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు గుర్తించి వెంటనే ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పశ్చిమ బెంగాల్ వాసి..

కర్నూలు, సెప్టెంబరు 22: మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో సప్తగిరి నగర్‌లో ఉంటున్న పశ్చిమ బెంగాల్ వాసి సనాతన్ లాహోర్ (19) అనే యువకుడు ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా జిల్లాకు చెందిన సనాతన్ లాహోర్, కర్మాకర్, మరి కొంత మంది యువకులు కర్నూలుకు పెయింటింగ్ పని కోసం వచ్చారు. స్థానిక సప్తగిరి నగర్‌లో పెయింటిగ్ పని చేసే ఇంట్లోనే ఉంటున్నారు. తాను ప్రేమించిన యువతి ఆత్మహత్యయత్నం చేసిందని, ఆమె చావుబతుకుల మధ్య ఉందని శనివారం రాత్రి సనాతన్ లాహోర్ మనోవేదనకు గురైనట్లు తెలుస్తోంది. ఆదివారం మిగతా వారు పనికి వెళ్లి.. తిరిగి వచ్చేసరికి సనాతన్ ఉరి వేసుకుని కనిపించాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మురళిధర్ రెడ్డి తెలిపారు.

రైలు కింద పడి వ్యక్తి మృతి

బనగానపల్లె, సెప్టెంబరు 22: మండలంలోని ఇల్లూరు కొత్తపేట గ్రామ సమీపంలో రైలు కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఇల్లూరు కొత్తపేట గ్రామానికి చెందిన జక్కా మదుసూధన్‌రావు (48) రైలు కట్టపైకి వెళ్లి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని నంద్యాల రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్‌లో డీఈఈ, ఏఈఈల బదిలీలు

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 22: గ్రామీణ నీటి సరఫరా అండ్ పారిశుద్య విభాగం ఉమ్మడి జిల్లాలో డీఈఈ, ఏఈఈలకు సంబంధించి బదిలీలు జరిగాయి. ఈ మేరకు ఆ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ సంజీవ్‌రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. నంద్యాల జిల్లా బనగానపల్లె డీఈఈ ఉమాకాంతరెడ్డిని అదే జిల్లా ఆత్మకూరుకు, ఇంజనీర్ ఇన్ చీఫ్ కార్యాలయంలో పని చేస్తున్న డీఈఈ కడియాల శ్రీనివాసులును నంద్యాల జిల్లా ఆళ్లగడ్డకు, ఆదోని డీఈఈ శివనాగేశ్వరావును హిందూపురం జిల్లా పెనుగొండకు, కర్నూలు సబ్ డివిజన్ డీఈ మోయినుద్దీన్‌ను మంత్రాలయంకు, కర్నూలు క్వాలిటీ కంట్రోల్ డీఈ రమేష్‌కుమార్‌రెడ్డిని నంద్యాల జిల్లా డోన్‌కు, అనంతపురం క్వాలిటీ కంట్రోల్ డీఈ కుషికుమార్‌రెడ్డిని కర్నూలు క్వాలిటీ కంట్రోల్‌కు, ఎమ్మిగనూరు డీఈ సాంబయ్యను ఆదోనికి, ఆత్మకూరు డీఈ జి.శ్రీనివాసులను కోడుమూరుకు, నందికొట్కూరు-2 ఎం. విద్యాసాగర్‌ను ఎమ్మిగనూరుకు, నందికొట్కూరు-1 అమలను కర్నూలు సబ్ డివిజన్‌కు బదిలీ చేస్తూ ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేశారు. వీరితో పాటు ఉమ్మడి జిల్లాలో ఏఈఈల బదిలీలు నిర్వహించారు.

వైభవంగా స్వర్ణ రథోత్సవం



స్వర్ణ రథాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

మంత్రాలయం, సెప్టెంబరు 22: మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు స్వర్ణ రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. ధార్మిక పర్యటన ముగించుకొని పీఠాధిపతి శ్రీమఠానికి చేరుకున్నారు. ఆదివారం పంచమి శుభ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బంగారు, వెండి, పట్టువస్త్రాలు, బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలతో చూడముచ్చటగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల మధ్య స్వర్ణ రథంపై వజ్రాలు పొదిగిన ప్రహ్లాదరాయలను అధిష్టించి, పీఠాధిపతి మహా మంగళ హారతులు ఇచారు. రథంపై నుంచి భక్తులకు ఆశీస్సులు అందజేశారు. అంతకు ముందు పీఠాధిపతి మూలరాములు, జయరాములు, దిగ్విజయ రాములకు స్వర్ణ నాణేలతో అభిషేకం చేసి మహా మంగళ హారతులు ఇచ్చి భక్తులను పీఠాధిపతి ఆశీర్వదించారు. ఆదివారం సెలవు దినం కావటంతో వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది.

పర్యాటక రంగంపై పోటీలు

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 22: ప్రపంచ పర్యాటక దినోత్సవ సందర్భాన్ని పురష్కరించుకొని ఈనెల 27వ తేదీ విద్యార్థులకు వక్తృత్వ, క్విజ్, డ్రాయింగ్, పెయుంటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా పర్యాటక అధికారి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. పర్యాటకం, శాంతి అనే అంశం, వక్తృత్వ పోటీ, ప్రముఖ పర్యాటక ప్రదేశాలపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించబడతాయన్నారు. ప్రపంచ, భారత్, ఆంధ్రప్రదేశ్ టూరిజంలపై క్విజ్ నిర్వహించడం తోపాటు విద్యార్థులు, యువకులకు ఒక నిమిషం నిడివి గల వీడియో ఉండాలని అన్నారు.. అలాగే జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రదేశాలు పర్యాటకులకు తెలియజేస్తూ ఆకట్టుకునే 15 నుంచి 20 సెకండ్ల నిడివితో రీల్స్ వీడియోలు రూపొందించి సమర్పించాల్సి ఉంటుందన్నారు. వీటిలో ఉత్తమంగా ఎంపిక కాబడిని వాటికి 27న ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయబడతాయని తెలిపారు. ఈ నెల 26 వతేదీ నాటికి టూరిజం వీడియో, రీల్స్ సమర్పించవలిసి ఉంటుందని జిల్లా పర్యాటక అధికారి తెలిపారు.

పీఆర్ ఇంజనీర్ల బదిలీలు

కర్నూలు పీఆర్ ఎస్ఈగా వి. రామచంద్రారెడ్డి

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 22: సాధారణ బదిలీల్లో భాగంగా పంచాయతీ రాజ్ విభాగంలో డీఈఈ, ఏఈఈల బదిలీలు నిర్వహించారు. ఈ మేరకు ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. కడపలో పని చేస్తున్న వి.రామచంద్రారెడ్డిని కర్నూలు పీఆర్ ఎస్ఈగా నియమించారు. కర్నూలు ఎస్ఈగా పని చేస్తున్న ఎస్ఈ సుబ్రమణ్యం జూన్ 30న పదవీ విరమణ పొందారు. అప్పటి నుంచి నంద్యాల ఈఈ రామ్మోహన్ ఇన్‌చార్జి ఎస్ఈగా బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా రామచంద్రారెడ్డిని కర్నూలు ఎస్ఈగా నియమించారు. దీంతో పాటు సీఆర్‌డీలో పని చేస్తున్న డీసీ వెంకటేషను ఆదోని ఈఈగా, పీఐయూ ఈఈ రామక్రిష్ణారెడ్డిని తూర్పు గోదావరి జిల్లా అమలాపురం ఈఈగా నియమిస్తూ ఉత్వర్వులు జారీ చేశారు.

- జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ ఎం.వెంకటసుబ్బారెడ్డిని ఇక్కడే నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పాటు జిల్లా పరిషత్ సీఈఓ జి.నాసర రెడ్డి కూడా సీఈఓగా ఇక్కడే కొనసాగేవిధంగా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

జిల్లా అధికారుల బదిలీ

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 22: జిల్లాలో పని చేస్తున్న పలువురు అధికారులు బదిలీ అయ్యారు. జిల్లా నూతన డీఆర్‌డీఏ పీడీగా ప్రతాప్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారిగా రామ్‌నాథ్ రెడ్డి, జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్‌గా నాగసుధ నియమితులయ్యారు. ప్రస్తుతం పని చేస్తున్న డీఆర్‌డీఏ పీడీ సలాంబాషా సంబంధిత డిపార్టుమెంటులో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. జిల్లా పంచాయతీ అధికారిగా పని చేస్తున్న నాగరాజు నాయుడు అనంతపురం జిల్లా డీపీవోగా నియమితులయ్యారు. జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్‌గా పని చేస్తున్న షర్మిళ విజయవాడకు బదిలీ అయ్యారు. అదేవిధంగా జిల్లాలోని గ్రేడ్-1 గ్రేడ్-2లు 300 మంది వీఆర్వోలు, పంచాయితీ కార్యదర్శులు గ్రేడ్-1 నుంచి 4 వరకు 126 మంది, గ్రేడ్-5లు 151 మంది, గ్రేడ్-6 కింద 75 మంది బదిలీ అయ్యారు.

యువకుడి దారుణ హత్య

- రంగంలోకి దిగిన పోలీసులు
- జాగిలంతో దర్యాప్తు ముమ్మరం



రవి (ఫైల్)

గూడూరు, సెప్టెంబరు 22: ఆదివారం తెల్లవారుజామున జరిగిన రవి అనే యువకుడి దారుణ హత్యతో గూడూరు జనం ఉలిక్కిపడ్డారు. యువకుడి హత్యకు కారణం.. ప్రేమ వ్యవహారమా లేక వివాహేతర సంబంధమా అనేది విచారణలో తెలియాల్సి ఉందని పోలీసులు అంటున్నారు. రంగంలోకి దిగిన పోలీసులు పోలీసు జాగిలం, ఫింగర్ ప్రింట్స్ బృందాన్ని రప్పించి దర్యాప్తును ముమ్మరం చేసారు. గూడూరులోని మూలగేరికి చెందిన చిన్న మద్దిలేటి, మద్దమ్మలకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తులు ఉన్నారు. వారి కుమారుడు రవి ఆదివారం తెల్లవారు జామున ఇంటి సమీపంలో ఆర్ కానాపురం వెళ్లే రహదారిలో ఉన్న కల్లందొడ్డిలో ఎద్దులకు మేత వేసేందుకు వెళ్లాడు. అక్కడ మాటుగాచిన గుర్తు తెలియని వ్యక్తులు ఒక్క సారిగా రవిపై కత్తులతో విచక్షణ రహితంగా దాడి చేసి గొంతు కోసి పరారయ్యారు. రక్తపు మడుగులో పడిఉన్న యువకుడు రవిని అటు వైపు వెళ్ళిన వారు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వెంటనే చికిత్స నిమిత్తం కర్నూలు తరలించారు. అయితే అప్పటికే రవి మృతి చెందాడు. గూడూరు ఎస్‌ఐ తిమ్మయ్య పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్ళి పరిశీలించారు. ఈ హత్యకు కారణం తెలియాల్సి ఉందని అన్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. సంఘటనపై సమగ్రంగా విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ తిమ్మయ్య వెల్లడించారు. యువకుడి కుటుంబ సభ్యులు, బంధువులు పోలీసు స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

శ్రీశైలంలో మరొకరు..

శ్రీశైలం, సెప్టెంబరు 22: శ్రీశైలం పరిధిలోని పాతాళగంగ రోడ్డుమార్గంలో శనివారం అర్ధరాత్రి ఆవుల అశోక్ కుమార్(32)ను హత్య చేశారు. వివరాలివీ.. దేవస్థానం డార్మిటరీ వెనుకభాగం సమీపంలో శనివారం అర్ధరాత్రి సమయంలో ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి మార్కాపురానికి చెందిన ఆవుల అశోక్ అనే వ్యక్తిని గాజు సీసాతో గొంతు కోశారు. తీవ్రంగా గాయపడిన అశోక్‌కుమార్‌ను స్థానికులు, పోలీస్ సిబ్బంది హుటాహుటీన 108 అంబులెన్స్‌లో సుండిపెంట ప్రాజెక్టు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్య సిబ్బంది పరీక్షించి అశోక్ కుమార్ మృతి చెందినట్లు నిర్ధారించారు. హంతకులు దేవస్థానం పరిధిలో భక్తులకు విభూతి బొట్లు పెట్టి జీవనం సాగించేవారిగా గుర్తించారు. అశోక్‌కుమార్ వారం రోజుల క్రితం బేల్దారి పనుల నిమిత్తం శ్రీశైలం వచ్చినట్లు పోలీసులు తెలిపారు. హత్యకు పాల్పడ్డ ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోనికి తీసుకుని, ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఇన్‌చార్జి సీఐ జి.చంద్రబాబు సిబ్బందితో కలిసి పరిశీలించారు.

లక్ష మందితో సభ నిర్వహిస్తాం



మాట్లాడుతున్న ఏపీ వీబీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జక్కల శ్రీనివాస్

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 22: వాల్మీకి బోయల ఎస్టీ రిజర్వేషన్ పునరుద్ధరణ కోసం త్వరలో లక్ష మందితో సభ నిర్వహిస్తామని ఏపీ వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జక్కుల శ్రీనివాసులు, క్రాంతి నాయుడు పేర్కొన్నారు. ఆదివారం జిల్లా పరిషత్‌లోని వాల్మీకి, బోయల ఎస్టీ అంశంపై రాష్ట్ర స్థాయి వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకి బోయలకు ఎస్టీ రిజర్వేషన్ ఇవ్వాలని గత వైసీపీ, టీడీపీ ప్రభుత్వాలు అసెంబ్లీలో ఆమోదం తెలిపాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వాల్మీకి అర్జున్, బాలమద్దిలేటి, తలారి కృష్ణ, శివ, సత్రం రామకృష్ణ, రవి, పెద్దయ్య నాయుడు పాల్గొన్నారు.

ఇరువురిపై కట్టెలతో దాడి

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 22: మండలంలోని తూడిచర్ల గ్రామంలో ఆదివారం ఉదయం ఎల్లపుల్లయ్య, నవీన్ అనే వ్యక్తులపై అదే గ్రామానికి చెందిన ఆరుగురు కట్టెలతో దాడి చేశారు. ఎల్లపుల్లయ్య, ఈడిగె శేఖర్‌గౌడులు కేసీ కాల్వ నీటిని మళ్లించే విషయమై మూడు రోజుల గొడవ పడ్డారు. ఆదివారం ఎల్లపుల్లయ్య, నవీన్ కలిసి శేఖర్‌గౌడు ఇంటి ముందు నుంచి వెళ్తున్నారు. శేఖర్ గౌడు వారిని దుర్భాషలాడాడు. అంతటితో ఊరుకోకుండా శేఖర్‌గౌడుతోపాటు శంకర్‌గౌడు, నాగేంద్రగౌడు, వెంకటేష్‌గౌడు, మహేష్‌గౌడు, ధనుంజయగౌడు అనే ఆరుగురు కలిసి వారిపై కట్టెలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన వారిని నందికొట్కూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

డీజీపీవో, డీఎఫ్‌వోల నియామకం

నంద్యాల, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా జిల్లాకు నూతన డీజీపీవో (జిల్లా గ్రామ పంచాయతీ అధికారి), డీఎఫ్‌వో (జిల్లా ఫారెస్టు అధికారి)ను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. షేక్ జమీఉల్లాను నంద్యాల డీజీపీవోగా నియమించగా, అన్నమయ్య జిల్లాలో డిప్యూటీ కన్సర్వేటర్‌గా పనిచేస్తున్న ఫారెస్టు అధికారిని నంద్యాల డీఎఫ్‌వోగా నియమించింది.

జగనన్న కాలనీలో దొంగ పట్టివేత

మద్దికెర, సెప్టెంబరు 22: మండలంలోని ఎం.అగ్రహారం గ్రామ శివారులోని జగనన్న కాలనీలో ఆదివారం తెల్లవారుజామున దొంగను స్థానికులు పట్టుకున్నారు. ఓ ఇంట్లో జొరబడుతుండగా మహిళలు గమనించి కేకలు వేశారు. దీంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమై దొంగను పట్టుకున్నారు. అయితే దొంగను పట్టుకునే సమయంలో స్థానికులపై దొంగ రాళ్ల దాడికి పూనుకున్నాడు. కాలనీలోని యువకులు ఆ దొంగను పట్టుకుని స్థంభానికి కట్టేసి పోలీసులకు సమాచారాన్ని అందించారు. పోలీసులు వచ్చి స్థానికులు పట్టుకున్న దొంగను తీసుకెళ్లారు. పోలీసుల విచారణలో వారి పేరు దీన్ దయాల్ అని, తనది ఒడిస్సా అని, ఇక్కడ పనులు చేసుకోవాలని వచ్చామని తెలిపాడు. ఎస్‌ఐ విజయకుమార్ ఆ దొంగను ఆదోనికి తరలించి అక్కడ వేలిముద్రలు సేకరించి ఒడి స్సాకు పంపిస్తామని తెలిపారు.

నీటి కుక్కల సంచారం



నీటి కుక్క

రుద్రవరం, సెప్టెంబరు 22 : మండలంలోని పాత వెలగలపల్లె వంకలోనీటి కుక్కలు కనిపించాయని స్థానికులు ఆదివారం సాయం త్రం తెలిపారు. గతంలో ఎన్నడూ కనిపించలేదన్నారు. సుమారు నాలుగు నీటి కుక్కలు నీటిలో వెళ్తుండగా చూశామని తెలిపారు. మొదటగా కొంత ఆందోళనకు చెందినా నీటి కుక్కలు ప్రజలకు హానీ చేయవని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. వాగు వెంట గట్టుపై ఎక్కడం, నీటిలో దూకడం కనిపించాయని స్థానికులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

పశుసంవర్థక సహాయకుల రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌బాబు పిలుపు

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 22: సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని పశుసంవర్థక శాఖ సహాయకుల రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు రాజేష్‌బాబు అన్నారు. ఆదివారం కర్నూలు నగరంలోని ఎన్జీవో హోంలో జిల్లా పశుసంవర్థక శాఖ సహాయకుల యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి నాన్ గ్రాడ్యుయేట్స్ వెటర్నేరియన్స్ ఫెడరేషన్ జిల్లా చైర్మన్ వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌బాబుతో పాటు ప్రధాన కార్యదర్శి విజయ నాయక్, కోశాధికారి మంజునాథ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్‌బాబు మాట్లాడుతూ పశుసంవర్థక శాఖ సహాయకులు శాఖకు సంబంధించిన పనులు విజయవంతంగా పూర్తి చేస్తూ ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేరుస్తున్నారని అన్నారు. అందువల్ల శాఖ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంఎం నాయక్ ఉత్తర్వుల మేరకు ఏహెచ్‌ఏలకు ఇతర శాఖలకు సంబంధించిన పనుల గురించి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలిగా నాగవాసవి, కార్యదర్శిగా సురేష్ కుమార్, గౌరవాధ్యక్షులుగా వెంకటేష్, కోశాధికారిగా భూపతి, ఉపాధ్యక్షులుగా సురేష్ బాబు, సుశీల, సంపత్ నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శరత్, సంయుక్త కార్యదర్శిగా శ్రావణి, శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి ఎలక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా సుధాకర్ వ్యవహరించారు.

వ్యక్తిపై దాడి

కర్నూలు, సెప్టెంబరు 22: నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో మాలిక్ అనే వ్యక్తిపై బషీర్ కత్తితో దాడి చేసి గాయపరిచాడు. బనగానపల్లె మండలం వీరాపురం గ్రామానికి చెందిన మాలిక్ లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం పార్వతి నగర్ సర్వీసు రోడ్డు వద్ద మాలిక్ బాషా, బషీర్ మధ్య గొడవ జరిగింది. లోడు తీసుకుని వెళ్లే సమయంలో ఒకరితో ఒకరు ఘర్షణ పడ్డారు. బషీర్ తల్లి మాలిక్‌బాషాను పట్టుకోగా.. బషీర్ కత్తితో కడుపులో పొడిచాడు. చుట్టుపక్కల వారు రావడంతో తల్లి, కొడుకులు ఇద్దరు పరారయ్యారు. స్థానికులు మాలిక్‌బాషాను ఆసుపత్రిలో చేర్పించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేంద్ర హోం శాఖ కార్యదర్శిని కలిసిన నంద్యాల ఎంపీ




కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవిందుమోహన్‌కు లడ్డూను అందజేస్తున్న ఎంపీ శబరి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 22 : ఢిల్లీలో కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవిందు మోహన్‌ను నంద్యాల ఎంపీ, లోక్‌సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డా. బైరెడ్డి శబరి ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి శేష వస్త్రం, స్వామి, అమ్మవార్ల ఫొటో, లడ్డూను ఆయనకు అందించారు. ఈ సందర్భంగా కేంద్ర హోం శాఖలో ఏపీకి సంబంధించిన పెండింగ్ ఫైళ్లను పరిష్కరించేందుకు సహకరించాలని ఎంపీ శబరి కోరారు.

సంతానలేమికి ఆధునిక చికిత్సలు

- ఐఎస్ఏఆర్ జాతీయ కార్యదర్శి డా. ఆశా అనిల్ బక్షి
- ముగిసిన సదస్సు... హాజరైన 460 మంది వైద్యులు



సీనియర్ ఇన్‌ఫెర్టిలిటీ వైద్యురాలు డా.వీటీ సీతాను సన్మానిస్తున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 22: పెళ్లయి రెండు, మూడేళ్ల దాటిపోయినా సంతానం కలగని దంపతులకు ఐవీఎఫ్ పద్ధతిలో సక్సెస్ రేట్ ఉంటుందని ఇండియన్ సొసైటీ అసిస్టెంట్ రీప్రొడెక్షన్ (ఐఎస్ఏఆర్) జాతీయ కార్యదర్శి డా. ఆశా అనిల్ బక్షి అన్నారు. నగరంలోని మౌర్యఇన్ హోటల్‌లో రాష్ట్ర ఇన్‌ఫెర్టిలిటీ వైద్యుల సదస్సులో ఆమె పాల్గొన్నారు. 35 లేదా అంత కంటే తక్కువ వయస్సు ఉన్న మహిళల్లో 40 శాతం, 38 నుంచి 40 ఏళ్ల మధ్య వయస్సు వారిలో సక్సెస్ రేటు 23 శాతం ఉంటుందన్నారు. ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్ డా.విష్ణుప్రియ మాట్లాడుతూ ఏఆర్‌టీల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.డి.విజయలక్ష్మి, ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు డా.శిరీషారెడ్డి, డా. శ్రావ్య, రాష్ట్ర అధ్యక్షురాలు డా.పద్మలత, కర్నూలు గైనిక్ సొసైటీ అధ్యక్షుడు డా. వెంకటరమణ పాల్గొన్నారు.

పత్తికొండ ఎమ్మెల్యేకు సన్మానం

నందికొట్కూరు, సెప్టెంబరు 22: జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నందికొట్కూరుకు పర్యటణకు వచ్చిన సందర్భంగా ఆయనకు స్వాగతం పలికేందుకు పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ.శ్యాంబాబు ఆదివారం మల్యాలకు వచ్చారు. అనంతరం కే.ఈ కుటుంబానికి అత్యంత సన్నిహితుడైన నందికొట్కూరులో టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి తమ్మడపల్లి విక్టర్ నివాసానికి ఎమ్మెల్యే వెళ్లారు. ఈ సందర్భంగా పత్తికొండ ఎమ్మెల్యే కే.ఈ.శ్యాంబాబు, తుగ్గలి నాగేంద్రలను ఆయన సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శేఖర్, రిటైర్డ్ ఎస్.ఐ జాన్, నవీన్, ప్రసాద్, ప్రాన్సిస్ ఉన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

● ఏపీ రైతు సంఘం నాయకుల డిమాండ్



నందికొటూరు శివారులో కల్లాల్లో ఉన్న మొక్కజొన్న ఉత్పత్తులను పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

నందికొట్కూరు, సెప్టెంబరు 22 : నందికొట్కూరు పట్టణంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఏపీ రైతు సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీ రైతు సంగం ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణంలోని పగిడ్యాల రోడ్డు సమీపంలోని కల్లాల్లో ఉన్న మొక్కజొన్న ఉత్పత్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా పిక్కిలి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నందికొట్కూరు నియోజకవర్గంలో మొక్కజొన్న పంటను విస్తారంగా సాగు చేశారన్నారు. ఇప్పటికే పంటల కోతలు మొదలయ్యాయయన్నారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండా నందికొట్కూరు పట్టణంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం నాయకులు సోమన్న, రామకృష్ణ, ఏసేపు, ఖాదర్బాషా తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

నంద్యాల రూరల్, సెప్టెంబరు 22 : రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీని వెంటనే అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం నంద్యాలలోని ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023జూలై 1నుంచి అమలు కావాల్సిన పీఆర్సీని ప్రభుత్వం అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయాలని లేకపోతే మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య మాట్లాడుతూ పాఠశాలల్లో యాప్‌ల ద్వారా టాయిలెట్ ఫొటోలు తీయడానికి సచివాలయ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులకు బాధ్యతలు కేటాయించారని, అయినా అధికారులు ప్రధానోపాధ్యాయులే వారి లాగిన్ ద్వారా ఫొటోలు తీయాలని ఒత్తిడి చేయడం సరికాదన్నారు. విద్యారంగంలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు జాకీర్‌హుసేన్, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులు, నాగార్జున, మధు, సుబ్బారెడ్డి, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- ప్రముఖ గుండె వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ క్రాంతి చైతన్య

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 22: పిల్లలలో మంచి అలవాట్లను నేర్పడానికి పాఠ్యాంశాల పునరుశ్చరణకు మరిన్ని బోధన కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రముఖ గుండె వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ క్రాంతి చైతన్య అన్నారు. నంద్యాలలో రైల్వే గూడ్స్‌షెడ్ ఏరియాలో ఏకే గోపాల భవన్‌లోని నంది విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో పేద విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన బోధన కేంద్రాన్ని డాక్టర్ క్రాంతి చైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి మంచి కార్యక్రమాలకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. మాజీ కౌన్సిలర్ శంకరయ్య మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఈ బోధన కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో నంది విజ్ఞాన కేంద్రం కన్వీనర్ రామరాజు, నాయకులు భాస్కర్, నాగేంద్రప్రసాద్, రమణ, చిన్నయ్య, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభంలో సంక్షేమం



ఎర్రమటంలో ప్రభుత్వ పథకాల కరపత్రాలను చూపుతున్న టీడీపీ నాయకులు

జూపాడుబంగ్లా, సెప్టెంబరు 22: పరి పాలనా సంక్షోభం లో ఉన్న కూడా సీఎం చంద్రబాబు ప్రజలకు సంక్షేమపథకాలు అం దిస్తున్నారని సర్పంచ్ నిర్మలమ్మ అన్నారు. మండలంలోని పోతు లపాడు గ్రామంలో సర్పంచ్ నిర్మలమ్మ, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం అనే కరపత్రాలను పంపిణీ చేశారు. వంద రోజుల పూర్తి అయిన సందర్భంగా మండలంలోని అన్నీ గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు.

కొత్తపల్లి: ప్రజా సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎర్రమఠం గ్రామ టీడీపీ నాయకులు చంద్రారెడ్డి, రామిరెడ్డి, పరమేశ్వరరెడ్డి అన్నారు. మండలంలోని ఎర్రమఠం గ్రామంలో ఆదివారం స్థానిక సర్పంచ్ బాల ఎల్లయ్య, పంచాయతీ సెక్రటరీ పార్థసారథి, గ్రామ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ముందుగా వారు వివిధ పథకాలతో కూడిన కరపత్రాలను ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరెడ్డి, మద్దిలేటి, శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కొడుకుపై తండ్రి హత్యాయత్నం

నంద్యాల రూరల్, సెప్టెంబరు 22: మండలంలోని భీమవరం గ్రామంలో కొడుకుపై తండ్రి కత్తితో దాడి చేశాడు. భీమవరం గ్రామానికి చెందిన పోతిరెడ్డి సుబ్బారెడ్డి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతడి కొడుకు శ్రవణ్ కుమార్‌రెడ్డి ఏడేళ్ల క్రితం ఉన్నత చదువుల కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. శనివారం గ్రామానికి వచ్చిన శ్రవణ్ తన తండ్రితో ఆస్తి పంపకం చేయాలని కోరాడు. దీంతో తండ్రి కొడుకుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. కోపోద్రిక్తుడైన సుబ్బారెడ్డి ఇంట్లోని కత్తితో కొడుకు శ్రవణ్‌పై దాడి చేశాడు. ఈ దాడిలో శ్రవణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు గాయపడిన శ్రవణ్‌ను నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జరిగిన ఘటనపై శ్రవణ్ పోలీసులకు ఫిర్యాదు చేయటంతో అతని తండ్రి సుబ్బారెడ్డిపై హత్యాయత్నం కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ అస్రార్ బాషా తెలిపారు.

మంత్రికి ఘన స్వాగతం



మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న టీడీపీ నాయకులు



వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

నందికొట్కూరు/నందికొట్కూరు రూరల్ సెప్టెంబరు 22: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాజెక్టుల పరిశీలనకు రాగా టీడీపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. మల్యాల సమీపంలోని హంద్రీనీవా సుజల స్రవంతి ఎత్తిపోతలపథకం ప్రాజెక్టు వద్ద నందికొట్కూరు ఎమ్మెల్యే జయ సూర్య, పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, నందికొట్కూరు టీడీపీ మాజీ ఇన్‌చార్జి తమ్మడపల్లె విక్టర్, తుగ్గలి నాగేంద్ర, టీడీపీ శ్రేణులు బొకేలు ఇచ్చి ఘనంగా స్వాగతం పలి కారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మంత్రికి ఎమ్మెల్యే వినతులు

నందికొట్కూరు నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ పనులు, కేసీ నికర జలాలు, అలగనూరు రిజర్వాయర్ మరమ్మతులు, మిద్దూరు ఎత్తిపోతల పథకం ఏర్పాటు, గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణం తదితర అంశాలకు సంబంధించి ఎమ్మెల్యే గిత్తా జయసూర్య మంత్రి నిమ్మల రామానాయుడుకు వినతిపత్రాలు సమర్పించారు. సాగునీటి ప్రాజెక్టులకు గేట్‌వేగా ఉన్న నందికొట్కూరు నియోజకవర్గం నుంచి రాయలసీమకు నీటిని తీసుకెళ్లేందుకు ఎలాంటి అభ్యంతరం లేదని, నందికొట్కూరు నియోజకవర్గంలోని పొలాలకు కూడా సాగు నీరు అందించే విధంగా ఎత్తిపోతల పథకాలు ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. కలవందలపాడు వద్ద మిద్దూరు ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేస్తే ఐదు వేల ఎకరాలకు సాగు, పలు గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. మండ్లెం వద్ద లిఫ్టు ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని, బ్రాహ్మణకొట్కూరు వద్ద హంద్రీనీవా కాలువకు తూమును ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. కేసీ కాలువకు తుంగభద్ర నుంచి కేసీ కాలువకు కేటాయించిన నికర జలాలు వచ్చేలా చూడాలన్నారు. 2014-19 మధ్యలో రూ.350 కోట్లతో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకాన్ని ఎలా పూర్తి చేశారో అలాగే ఈ సారి కూడా మిద్దూరు ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభించి పూర్తి చేయాలని ఆయన మంత్రికి వినతిపత్రాలను సమర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీరం ప్రసాద్ రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, కడియం వెంకటేశ్వర యాదవ్, గిరీశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పలుచాని మహేశ్వర్‌రెడ్డి, ముర్తుజావళి, లాయర్ జాకీర్, జమీల్, రసూల్ పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చాలి- సీపీఐ

నందికొట్కూరు మండలం మల్యాల వద్ద గల హంద్రీ నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం పరిశీలనకు విచ్చేసిన రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి నిమ్మల రామానాయుడుకు సీపీఐ పార్టీ జిల్లా నాయకులు రఘురాం మూర్తి, రమేష్‌బాబులు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నందికొట్కూ రు చుట్టు పుష్కలంగా శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్ వాటర్, ఎత్తిపోతల ప్రాజెక్టులు పోతున్నా పట్టణానికి తాగు, సాగునీరు లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇదే విషయాన్ని పాదయాత్రలో యువగళం పాదయాత్రలో నారా లోకేష్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు గుర్తు చేశారు. మంత్రి నిమ్మల రామానాయుడు మా ట్లాడుతూ ఇచ్చిన హామీలను తప్పక నెరవే ర్చుతామన్నారు. అలాగే 98 జీవో బాధితులు తమ సమస్యలను పరిష్కరించాలని మంత్రికి వినతి పత్రం అందజేశారు.

చంద్రబాబుతోనే ప్రజా సంక్షేమం

- నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

పాములపాడు సెప్టెంబరు 22: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. ఆదివారం పాములపాడు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో గోపికృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వం అధికార పగ్గాలు చేపట్టిన వంద రోజుల్లోనే వంద పనులకు పైగా పనులు పూర్తి చేశారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో నూతన పింఛన్లు, మూడ వంట గ్యాస్ సిలిండర్లు అక్టోబరులో ఉచితంగా అందిస్తామన్నారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. 2014,2019 టీడీపీ హయాంలో మాండ్ర శివానంద రెడ్డి ఆధ్వర్యంలో పాములపాడు మండలంలో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఎకరాకు సాగు నీరందించిన ఘనత టీడీపీకే దక్కిందన్నారు. గత జగన్ రెడ్డి పాలనలో దోచుకోవడం, దాచుకోవడమే తప్ప అభివృద్ధి శూన్యమన్నారు టీడీపీ ప్రభుత్వంలో విద్యార్థులకు విద్యాశాఖ మంత్రి నారాలోకేష్, స్కిల్ డెవలప్‌మెంట్ ఏర్పాటు చేసి నైపుణ్యతను ఏర్పాటు చేసి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నారన్నారు. రానున్న ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించే లక్ష్యంగా పని చేస్తున్నారన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం అన్ని స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భాగ్యమ్మ, టీడీపీ నాయకులు, తిమ్మారెడ్డి, రవీంద్రారెడ్డి, హరినాథరెడ్డి, మధుకృష్ణ, బండ్లమూరి వెంకటేశ్వరరావు, గోవిందు, చంద్రశేఖర్, పూసల కృష్ణ, మద్దిలేటి, మల్లికార్జున, లక్ష్మీకాంత రెడ్డి, ఆదిరెడ్డి, మల్లేశ్వరరెడ్డి, స్వాములు లింగేష్ గౌడ్, హఫీజ్‌ఖాన్, సురేష్, జనసేన నాయకులు రాము, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తికి ఏపీటీఎఫ్ ప్రతిరూపం



సమావేశంలో మాట్లాడుతున్న హృదయరాజు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 22: పోరాట స్ఫూర్తికి ఏపీటీఎఫ్ ప్రతి రూపమని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు అన్నారు. 80వసంతాలు ఏపీటీఎఫ్ పూర్తిచేసుకున్న సందర్భంగా ఆదివారం నంద్యాలలోని రామకృష్ణ పీజీ కళాశాల ఆడిటోరియంలో జిల్లా విద్య, వైజ్ఞానిక మహాసభ నిర్వహించారు. కార్యక్రమానికి ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. టీచర్ల సమస్యలపై అలుపెరగని పోరాట సంస్థగా పని చేస్తుందన్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంతోపాటు ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకై, సమాజ శ్రేయస్సుకు పాటుపడటం గర్వించదగ్గ విషయమన్నారు. అయితే ఉపాధ్యాయులు స్వేచ్ఛగా బోధన చేసే పరిస్థితుల్లేవని, బోధనకు ఆటంకంగా ఉన్న అన్ని యాప్‌లను తొలగించాలని, మీడియం సిలబస్, పరీక్షలపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. అక్టోబర్ 6,7,8తేదీల్లో విజయనగరంలో జరిగే 80వసంతాల వేడుకలు, 20వ విద్య, వైజ్ఞానిక రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో రామకృష్ణ విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, డైట్ కాలేజి సీనియర్ లెక్చరర్ శంషుద్దీన్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఇస్మాయిల్, నంద్యాల జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాధవస్వామి, నగిరి శ్రీనివాసులు, సాంబశివుడు, ఉమ్మడి కర్నూలు జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలు అవసరం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎన్ఎండీ ఫిరోజ్

నంద్యాల రూరల్, సెప్టెంబరు 22 : విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు ఎంతో అవసరమని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్ అన్నారు. ఆదివారం నంద్యాలలోని గురురాజా ఇంగ్లీష్‌మీడియం స్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించిన ఇన్‌ట్రా స్కూల్ ప్రో వాలీబాల్ టోర్నమెంట్‌ను టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, గురురాఘవేంద్ర విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ దస్తగిరిరెడ్డి, జిల్లా ఒలింపిక్ సంఘం మాజీ చైర్మన్ డాక్టర్ రవి కృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సం దర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలవల్ల ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. టోర్నమెంట్‌లో 14జట్లు పాల్గొన్నాయి. అంతకుముందు జట్ల క్రీడాకారుల నుంచి అతిథులు గౌరవ వందనం స్వీకరించారు. పోటీల్లో విజేతలుగా నిలి చిన జట్లకు షీల్డ్, మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో గురురాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్లు మౌలాలిరెడ్డి, షేక్షావలిరెడ్డి, ఏపీ స్టేట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పిచ్చిరెడ్డి, ఎస్పీజీ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ దివాకర్, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లకీ ఉత్సవం



పల్లకీలో పూజలందుకున్న స్వామి, అమ్మవార్లు

శ్రీశైలం, సెప్టెంబరు 22: శ్రీశైల మహా క్షేత్రంలో లోకకల్యాణార్థం ఆదివారాన్ని పురస్కరించుకొని స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపములో నిర్వహించిన ఉత్సవ కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహా గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు నిర్వహించి పల్లకీలో ఆశీ నుల నుజేసి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉత్సవాన్ని నిర్వహించారు.

వెదురు కర్రల వాహనం స్వాధీనం



వెదురు కర్రల వాహనాన్ని పట్టుకున్న అటవీ సిబ్బంది

మహానంది, సెప్టెంబరు 22: నల్లమల అడవి నుంచి అక్రమంగా వాహనంలో తరలిస్తున్న వెదురు కర్రలను మండలంలోని తమ్మడపల్లి సమీపంలో అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం అటవీశాఖ డీఆర్వో హైమవతి ఆధ్వర్యంలో సిబ్బంది ముందస్తు సమాచారం మేరకు దాడులు నిర్వహించి అక్రమంగా వెదురు కర్రలను తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నారు. నంద్యాల అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. కార్యక్రమంలో అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

● ఎనిమిది మందిపై కేసు నమోదు

నందికొట్కూరు, సెప్టెంబరు 22: తీసుకున్న అప్పును చెల్లించాలని ఒత్తిడి చేయడంతో మాటామాట పెరిగి ఒకరిపై ఒకరు దాడి చేసుకునే స్థాయికి వె ళ్లిన ఘటన నందికొట్కూరు పట్టణంలో చోటు చేసుకుంది. ఆదివారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నందికొట్కూరు పట్టణానికి చెందిన ఇ ర్ఫాన్, కలాంబాష ఇద్దరు మిత్రులు. కలాంబాషకు డబ్బులు అవసరం కావ డంతో ఇర్ఫాన్ వద్ద కొంత డబ్బులు అప్పుగా తీసుకొని ప్రతి నెల వడ్డీ చెల్లిస్తూ వచ్చాడు. అయితే ఇర్ఫాన్ మొత్తం డబ్బులు కావాలంటూ ఒత్తిడి చేయడంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగింది. దీంతో ఇర్ఫాన్ తండ్రి షేక్షావళి, రాహిల్‌లకు విషయం చెప్పి దుకాణం వద్దకు తీసుకువచ్చాడు. డబ్బులు ఇవ్వాలని వచ్చిన వారు నిలదీయడంతో మాటామాట పెరిగి ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. దీంతో కలాంబాష, మహ్మద్‌బాష, ఇమ్రాన్, ఉస్సేన్, ఇర్ఫాన్, షేక్షావళి, రాహిల్, ప్రసాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఇరు వర్గాలపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ సుబ్బారావు తెలిపారు.

ఆటో బోల్తా.. ముగ్గురికి తీవ్ర గాయాలు

ఆత్మకూరు రూరల్, సెప్టెంబరు 22: ముందు వెళ్తున్న కారును ఢీకొని, ఓ ఆటో బోల్తా పడగా ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన ఆత్మకూరు మండలం కరివేన సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఆత్మకూరు మండలం కృష్ణాపురం గ్రామానికి చెందిన శేఖర్‌తోపాటు అతడి అమ్మ నాగమ్మ, తమ్ముడు శ్రీనుతో కలిసి ఓ ఆటోలో నందికొట్కూరుకు బయలుదేరారు. కాగా ఆటో కరివేన శివార్లలో ముందు వెళ్తున్న ఓ కారు సడన్ బ్రేక్ వేయడంతో ఆటో ఒక్కసారిగా కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో బోల్తా పడటంతో శేఖర్, నాగమ్మ, శ్రీను తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

భాగవత పారాయణం చేయాలి



ప్రవచనాలు చెబుతున్న దివి హయగ్రీవాచార్యులు

నంద్యాల (కల్చరల్), సెప్టెంబరు 22: దేవీ భాగవత పారాయణం చేయడం వలన ఉత్తమ ఫలితాలు లభిస్తాయని టీటీ డీ, శ్రీశైల దేవస్థానం వ్యాఖ్యాత డా క్టర్ దివి హయగ్రీవాచార్యులు అన్నా రు. ఆదివారం సాయంత్రం నం ద్యాల రమాసమేత సత్యనారాయణ స్వామి దేవస్థానంలో దేవీ భగవత ప్రవచనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవి భాగవతం పారాయణం చేయటం వలన గానీ, వినటం వలన గానీ అనేక భయాలు తొలగి, ప్రజలు సుఖశాంతులతో జీవిస్తార న్నారు. కావ్యాలలో రామాయణం, గ్రహాలలో సూర్యుడు, తారకలలో చంద్రుడు, మంత్రాలలో గాయత్రీ మంత్రం ఎంత గొప్పదో పురాణాలలో దేవీభాగవతం అంత గొప్పదని వివరించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

ప్రజల పక్షాన ఎర్రజెండా

● సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు



పట్టణంలో జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

నందికొట్కూరు, సెప్టెంబరు 22: ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతున్నది ఎర్రజెండా కమ్యూనిస్టులే అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక వాల్మీకి నగర్ సీపీఎం శాఖ మహాసభ స్థానిక వడ్డేపేట కాలనీలోని పాఠశాలలో సీపీఎం నాయకుడు పక్కీర్ సాహెబ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ముందుగా పార్టీ పతాకాన్ని సీపీఎం నాయకులు ఉస్మాన్‌బాష ఆవిష్కరించారు. అమరజీవులు సీతారాం ఏచూరి, కే.భాస్కర్‌రెడ్డిలకు నివాళ్లు అర్పించి సంతాపాన్ని ప్రకటించారు. మహాసభలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు మాట్లాడుతూ భవిష్యత్తులో దేశ రాజకీయాల్లో కమ్యూనిస్టులే ప్రత్యామ్నాయమన్నారు. వాల్మీకి, వడ్డేపేట కాలనీలో సీసీ రోడ్లు, డ్రైనేజీ, పాఠశాలలో తాగునీటి ట్యాంకులు తదితర సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తామని తీర్మాణం చేశారు. అనంతరం శాఖ కార్యదర్శిగా డి.బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, శాఖ సభ్యులు జావీద్, మహ్మద్ రషీద్, పాండు, స్వామి నాయుడు, షబ్బీర్, గోకారి పాల్గొన్నారు.

పూడికతీత పనులు చేపట్టాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు రాజశేఖర్

ఆత్మకూరు, సెప్టెంబరు 22: ఆత్మకూరు పట్టణం మీదుగా ప్రవహించే గుండ్లకమ్మవాగులో పూడికతీత పనులు చేపట్టి లోతట్టు కాలనీల ప్రజలను కాపాడాలని సీపీఎం నాయకులు రాజశేఖర్, రణధీర్, రామ్‌నాయక్ కోరారు. ఆదివారం స్థానిక ఏకలవ్యానగర్‌లో నిర్వహించిన సమావేశంలో ఆ పార్టీ మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుండ్లకమ్మవాగు ఆక్రమణలకు గురవ్వడంతో పాటు పూడిక చేరడంతో సమీప లోతట్టు కాలనీల్లోకి వరదనీరు చేరి ప్రజలు అవస్థలు పడుతు న్నారని అన్నారు. లోతట్టు కాలనీవాసుల ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో నాయకులు సురేంద్రబాబు, నాగేశ్వరరావు, గో విందు, శివకుమార్, వీరన్న, రమణ, రఫీ, సుబ్బయ్య, రైట్ బాషా పాల్గొన్నారు.

జిల్లా చెస్ జట్ల ఎంపిక పోటీలు



విజేతలతో చెస్ సంఘం నాయకులు

నంద్యాల రూరల్, సెప్టెంబరు 22 : జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో ఓపెన్, అండర్ -15బాలికల జిల్లా స్థాయి చెస్ ఎంపిక పోటీలు జరిగాయి. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డా.రవికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెస్ క్రీడతో మెదడుకు పదును పెరుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని నిరంతర సాధనతో చెస్‌లో మెళకువలను, నైపుణ్యాలను పెంచుకోవాలన్నారు. పోటీల్లో పాల్గొని ప్రతిభగల క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో చెస్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బరెడ్డి, ఉపాధ్యక్షులు రాధాచక్రవర్తి, శ్రీనిష్, సుజాత పాల్గొన్నారు.

కామేశ్వరీదేవి అమ్మవారిపై కీర్తనలు

మహానంది, సెప్టెంబరు 22: మహానంది క్షేత్రంలోని కామేశ్వరీదేవి అమ్మవారితో పాటు కోదండరాముల స్వామిలపై తాళ్లపాక అన్నమాచార్యుల 12వ తరం హరినారాయణ చార్యులు తాళ్లపాక స్వామిజీ ప్రత్యేక కీర్తనలను ఆలపించారు. ఆదివారం మహానందీశ్వరుని దర్శనం కోసం స్వామిజీ రాగా ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ప్రధాన ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణ మంటపంలో వేదపండితుడు శాంతారాం భట్ సన్మానించి స్వామి వారి ప్రసాదాలు అందజేశారు. అనంతరం స్వామిజీ అమ్మవారు, కోదండరాముల స్వామిపై స్వామిజీ భక్తి శ్రద్ధలతో కీర్తనలను ఆలపించారు. అలాగే మండలంలోని గాజులపల్లి ఆర్ఎస్ మరకతలింగేశ్వరుని స్వామి మీద కీర్తనలు పాడారు.

షాదీఖానాలో పారిశుధ్య పనులు

పాణ్యం, సెప్టెంబరు 22 : స్థానిక షాదీఖానాలో టీడీపీ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఆదివారం జిల్లా టీడీపీ మైనార్టీ నాయకులు ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో కంపచెట్లు, ముళ్లపొదలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. అభివృద్ధి పనులు చేపట్టి పెళ్లిళ్లకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలో మరిన్ని సౌకర్యాలు కల్పించేలా ఎమ్మెల్యే గౌరు చరిత చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, ముస్లిం యువకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నగదును అందజేస్తున్న జనసేన, బలిజ సంఘం నాయకులు

గడివేముల, సెప్టెంబరు 22: మండలంలోని ఆళ్లగడ్డ గ్రామానికి చెందిన జనసేన కార్యకర్త రామచంద్రుడు (42) ఇటీవల గుండెపోటుతో మరణించా డు. విషయం తెలుసుకున్న జనసేన మండల నాయకులు ధరణి చంద్రమోహన్, మహమ్మద్‌రఫి, సతీష్‌లు, జనసేన కార్యకర్తలు కలిసి రూ.20 వేలు, బలిజ సంఘం నాయకులు రంగస్వామి, వెంకటేశ్వర్లు, మద్దిలేటిలు, సంఘ నాయకులు రూ.45 వేలు ఆర్థిక సహాయం అం దజేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్, కిరణ్, ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

పంట పొలాలకు దారేదీ?




మోకాలు లోతు గుంత



శిరివెళ్ల మెట్ట వద్ద అధ్వానంగా ఉన్న కేసీ ఉప కాల్వ ఆయకట్టు రహదారి

- అడుగుకో గుంత.. రైతులకు చింత
- అధ్వానంగా మారిన కేసీ ఆయకట్టు రహదారులు
- పంట పొలాలకు వెళ్లడానికి తప్పని అవస్థలు
- రహదారుల పునరుద్ధరణ మరిచిన గత ప్రభుత్వం

శిరివెళ్ల, సెప్టెంబరు 22: ఆళ్లగడ్డ నియోజకవర్గంలో కేసీ ప్రధాన కాల్వతో పాటు ఉప కాల్వల కింద వేల ఎకరాల ఆయకట్టు భూములున్నాయి. శిరివెళ్ల, దొర్నిపాడు, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల్లో వేలాది మంది రైతులు ఖరీఫ్, రబీ సీజన్‌లలో వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. పొలాలకు వెళ్లే రహదారులు ఛిద్రమై ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. ప్రధానంగా కేసీ ఉప కాల్వలకు అనుసంధానంగా ఉన్న ఆయకట్టు రహదారుల్లో గోతులు ఏర్పడడంతో ఎరువులు,



కేసీ ప్రధాన కాల్వ

కూలీలను తరలించుకునేందుకు, వ్యవసాయ పనులు చేపట్టేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మారుతున్నారే తప్ప ఆయకట్టు రహదారుల అభివృద్ధిని విస్మరించారని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం రహదారుల పునరుద్ధరణ పూర్తిగా గాలికొదిలేసిందని రైతులు వాపోతున్నారు.

సాగు నీటి సంఘాలపై నిర్లక్ష్యం :

గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి సంఘాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. 2015లో టీడీపీ హయాంలో సాగునీటి సంఘాలకు చివరగా ఎన్నికలు నిర్వహించారు. అనంతరం వైసీపీ అధికారంలోకి వచ్చాక ఎన్నికలు నిర్వహించకపోవడంతో సంఘాలు నిర్వీర్యమయ్యాయి. దీంతో కేసీ కెనాల్ అభివృద్ధి పనులు, ఆయకట్టు రహదారుల పునరుద్ధరణపై తీవ్ర ప్రభావం ఏర్పడింది. ఫలితంగా కేసీ ఆయకట్టు రైతులు అధ్వానంగా మారిన రహదారుల్లో నిత్యం నరకం అనుభవిస్తున్నారు. కేసీ కెనాల్ ఆయకట్టు వెంట అధికారులు, ప్రజాప్రతినిధిలు పర్యటించి రహదారులను పరిశీలించి వాటిని పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.



శిరివెళ్లలో గోతులమయంగా మారిన ఆయకట్టు రహదారి

గోతుల్లో మట్టి కూడా వేయలేదు



కేసీ కెనాల్ కాల్వల వెంట ఉన్న రహదారులు గోతులమయంగా మారాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రహదారుల్లోని గోతుల్లో కనీసం మట్టి కూడా వేయలేదు. శిరివెళ్ల మెట్ట నుంచి వెంకటేశ్వరాపురం వరకు ఉన్న పంట పొలాల రహదారి దారుణంగా మారడంతో అవస్థలు పడుతున్నాం. రైతులను విస్మరించిన ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదు.

పీపీ లింగమయ్య, రైతు, శిరివెళ్ల

రహదారులను పునరుద్ధరించాలి



కేసీ కెనాల్‌తో పాటు గ్రామాల్లోని చెరువుల ఆయకట్టు రహదారులను ప్రభుత్వం పునరుద్ధరించాలి. ఆయా శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించే అవకాశం ఉంటుంది. రైతుల సమస్యలపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి.

- కృష్ణ కిషోర్, రైతు, శిరివెళ్ల

పంట నమోదు తప్పనిసరి

చాగలమర్రి, సెప్టెంబరు 22: ఖరీఫ్ సీజనల్‌లో పంటలు సాగు చేసిన రైతులు పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని ఏవో రంగనేతాజీ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ 4 వేల హెక్టార్లలో రైతులు వివిధ పంటలు సాగుచేశారని అన్నారు. పంట సాగు చేసిన ప్రతి ఒక్క రైతు పంట నమోదు చేయించాలని అన్నారు. ఇప్పటి వరకు 98 శాతం రైతులు ఈక్రాప్ చేసుకున్నారని, మిగిలిన రైతులు ఈనెల 23వ తేదీ లోపు నమోదు చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఏఈవో మంజుల, వీఏఏ సుబ్బరాయుడు ఉన్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం

చాగలమర్రి, సెప్టెంబరు 22: టీడీపీతోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని టీడీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, పుల్లయ్య తెలిపారు. ఆదివారం మండలంలోని చక్రవర్తులపల్లె, మల్లేవేముల గ్రామాల్లో ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదేశాల మేరకు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. టీడీపీ నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి కరపత్రాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. టీడీపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, టీడీపీ నాయకులు ఓబయ్య, ప్రమోద్, నరసింహులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత నల్లమలను నెలకొల్పుదాం



ప్లాస్టిక్ కవర్లను తొలగిస్తున్న రేంజర్ శ్రీపతినాయుడు

రుద్రవరం, సెప్టెంబరు 22 : ప్లాస్టిక్ రహిత నల్లమల అడవిని నెలకొల్పాలని రేంజర్ శ్రీపతినాయుడు అన్నారు. ఆదివారం నల్లమల అడవిలో భాగంగా రుద్రవరం రేంజ్‌లోని ఎగువ అహోబిలం భవనాశి నది పరిసరాల్లో ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లను సిబ్బంది స్వచ్ఛ సేవకులతో ఏరివేయించారు. పచ్చని ఆహ్లాదకరమైన అడవులను భక్తులకు స్వచ్ఛమైన గాలిని ఆస్వాదించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. రుద్రవరం రేంజ్‌లోని నల్లమల అడవిలో కొలువుదీరిన నవ నరసింహ స్వామి క్షేత్రాల పరిధిలో ప్లాస్టిక్ వ్యర్థపదార్థాలు తొలగించడం జరిగిందన్నారు. గుడికి వచ్చే భక్తులకు కూడా సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజర్ ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసర్లు మక్తర్‌బాషా, శ్రీనివాసరెడ్డి, బీట్ ఆఫీసర్లు జయవర్ధన్, మహబూబ్‌ఖాన్, నాగ హుసేనయ్య, సురేంద్రగౌడ్, నరసింహారెడ్డి, జేమ్స్, రామక్రిష్ణ పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

బనగానపల్లె, సెప్టెంబరు 22: మండలంలోని నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బీరవోలు గ్రామానికి చెందిన చాకలి నడిపి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య ఆదివారం తెలిపారు. క్వార్టర్ బాటిల్స్ అమ్ముతుండగా పట్టుకొని క్వార్టర్ బాటిళ్ల స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి, క్వార్టర్ బాటిళ్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమతులు లేని టపాసుల స్వాధీనం

బనగానపల్లె, సెప్టెంబరు 22: పట్టణంలోని కొండపేటలోని రాజాప్రసాద్ అను వ్యక్తి నుంచి అనుమతులు లేని సుమారు రూ.52 వేల విలువగల టపాకాయలు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ కృష్ణయ్య ఆదివారం తెలిపారు. టపాకాయలు వంటి పేలుడు పదార్థాలు ఇళ్లలో నిల్వ ఉంచుకోరాదన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా జనవాసాలకు దగ్గరగా టపాకాయలు లేక ప్రేలుడు పదార్థాలు నిల్వ ఉంచుకున్నట్లయితే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

శిరివెళ్ల, సెప్టెంబరు 22 : మండలంలోని గుంప్రమాన్‌దిన్నె గ్రామానికి చెందిన బోయ కల్యాణ్ కుమార్ అనే వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చిన్న పీరయ్య ఆదివారం తెలిపారు. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి కల్యాణ్ కుమార్ మోసగించడంతో పాటు దుర్భాషలాడినట్లు గ్రామానికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కల్యాణ్ కుమార్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశామన్నారు.

రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

బనగానపల్లె, సెప్టెంబరు 22: మండలంలోని పలుకూరు గ్రామంలో రైతు ఎల్లసుబ్బయ్య విద్యుదాఘాతంలో మృతి చెందారని, వారి కుటుంబానికి ప్రభుత్వం రూ.20 లక్షల సాయం అందించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడు కోరారు. ఆదివారం పలుకూరులోని రైతు కుటుంబాన్ని పరామర్శించారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతు మృతి చెందారన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం సభ్యుడు బాలశేఖర్ పాల్గొన్నారు.

ఈకేవైసీ చేసుకోవాలి

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 22 : రైతులు ఖరీఫ్ సీజన్‌గా సాగు చేసిన పంటలకు పంట నమోదుతో పాటు ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి భూమా జ్యోతి తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో 5414ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారన్నారు. రైతులు వ్యవసాయ సిబ్బందిని సంప్రదించి పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు.

పేదల పక్షపాతి చంద్రబాబు

- డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి

ప్యాపిలి, సెప్టెంబరు 22: సీఎం చంద్రబాబు పేదల పక్షపాతి అని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొమ్మెమర్రి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కోట్ల మాట్లాడుతూ పేదల ముఖాల్లో ఆనందం కోసమే సీఎం పింఛన్ పెంపుతో పాటు అన్నా క్యాంటీన్ల ద్వారా రూ.5లకే భోజనం పెడుతూ మూడు పూటలు కడుపులు నింపుతున్నారన్నారు. దశల వారిగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తామన్నారు. అలాగే గ్రామాల్లో నెలకొన్న అన్ని సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం కోట్ల గ్రామంలో తిరిగి టీడీపీ ప్రభుత్వం వంద రోజుల పాలనను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఫజుల్ రహిమాన్, పీఆర్ ఏఈ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు ఎద్దులదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, వై లక్ష్మీనారాయణయాదవ్, కొమ్మెమర్రి వెంకటరాముడు, గండికోట రామసుబ్బయ్య, అలేబాదు పరమేష్, మాధవరం స్వామి, రంగస్వామి, రమేష్, శివారెడ్డి, ఆర్ఈ నాగరాజు, లింగన్న, కర్ణం రామ్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ: మండలంలోని రాచెర్ల బీసీ వసతి గృహాన్ని ఎమ్మెల్యే కోట్ల తనిఖీ చేశారు. వసతి భవనంలో మరుగుదొడ్లు, తాగునీటి వవసతులు సరిగా లేవని, దీనిపై ప్రభుత్వానికి నివేదిక పంపామని ఎంపీడీవో ఫజుల్ రహిమాన్ ఎమ్మెల్యేకు వివరించారు. వార్డన్ సక్రమంగా విధులకు హాజరు కావడం లేదని ఎమ్మెల్యే పలువురు గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకరావడంతో చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట టీడీపీ, బీజేపీ నాయకులు లక్షసాగరం లక్ష్మిరెడ్డి, వడ్డే మహారాజ్, దామోదర్‌నాయుడు పలువురు అధికారులు ఉన్నారు.



ప్యాపిలి: కొమ్మెమర్రిలో డోన్ ఎమ్మెల్యే కోట్ల పర్యటన



బనగానపల్లె: మాట్లాడుతున్న టీడీపీ నాయకులు



చాగలమర్రి: గైబుసా దర్గా వద్ద ఫాతెహాలు చేస్తున్న టీడీపీ నాయకులు

తప్పుడు ప్రచారం మానుకోవాలి

బనగానపల్లె, సెప్టెంబరు 22: టీడీపీ వంద రోజుల పాలనపై వైసీపీ నాయకులు, వారి కరపత్రికలో తప్పుడు ప్రచారం చేస్తూ విషం కక్కడం దారుణమని మండల టీడీపీ నాయకులు మండిపడ్డారు. బనగానపల్లె పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గం టీడీపీ అధికార ప్రతినిధి కాట్రెడ్డి మల్లికార్జునరెడ్డి, నంద్యాల జిల్లా టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య, బనగానపల్లె పట్టణ టీడీపీ అధ్యక్షుడు కోలంబాబు మాట్లాడుతూ వందరోజుల ఎన్‌డీఏ పాలనపై వైసీపీ పత్రిక తప్పుడు కథనాలు ప్రచురించడం మానుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా టీడీపీ బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి భూషన్న, పూలకాశీం పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే టీడీపీ లక్ష్యం

చాగలమర్రి, సెప్టెంబరు 22: పేదల సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ రాష్ట్ర మైనార్టీ సెల్ ఉపాధ్యక్షుడు అన్సర్‌బాషా అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆదివారం జమ్మలమడుగు పరిధిలోని గైబుసా పహాడ్ దర్గా వద్ద టీడీపీ నాయకులతో కలిసి ప్రత్యేక ఫాతెహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో సంక్షేమ పాలన అందించి మంచి ప్రభుత్వంగా నిలిచిందని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొలిమి మాబుషరీఫ్, మౌలాలి, జెట్టి నాగరాజు, అజీమ్, గఫార్, షబ్బీర్, అస్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం గంగమ్మకు పూజలు

కొలిమిగుండ్ల, సెప్టెంబరు 22 : కొలిమిగుండ్లలో వర్షం కోసం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామ సమీపంలో వంక వద్ద గంగమ్మ తల్లి, పోతురాజు ప్రతిమలను ప్రతిష్ఠించి పూజలు చేశారు.



గంగమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

భక్తి శ్రద్ధలతో విష్ణు సహస్ర యజ్ఞం

చాగలమర్రి, సెప్టెంబరు 22: చాగలమర్రి గ్రామంలోని కోదండరామాలయంలో పీఠాధిపతి అభినవ శంకరానందస్వామి ఆధ్వర్యంలో ఆదివారం మహిళా మండలి సభ్యులచే విష్ణు సహస్ర ధ్యాన యజ్ఞం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రవచనాలు పలికించి యజ్ఞం చేశారు.

పంట నమోదు గడువు పెంచాలి

డోన్(రూరల్), సెప్టెంబరు 22: రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఈక్రాప్ నమోదు గడువు పెంచాలని జిల్లా విజిలెన్స్ సమితి సభ్యులు ఏఈ నాగారాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ అధికారులు చేసిన రీసర్వేలతో గ్రామాల రైతుల భూములు గల్లంతయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లలో రైతుల భూముల వివరాలు కనిపించడం లేదని, ఇటువంటి సమయంలో రైతులకు ఈక్రాప్ నమోదు చేసుకోవడం ఇబ్బంది అవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీటిపై స్పందించి ఈక్రాప్ నమోదు గడువు పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలి

డోన్(రూరల్), సెప్టెంబరు 22: అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో వెంటనే డబ్బులు జమ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో రంగనాయుడు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం కింద తక్షణమే సాయం అందించాలన్నారు. ఎన్నికల సమయంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సుంకయ్య, రాధాకృష్ణ, పట్టణ కార్యదర్శి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెడిసిన్‌లో మురిసిన ఆణిముత్యం

కోవెలకుంట్ల, సెప్టెంబరు 22 : మండలంలోని వెలగటూరు గ్రామానికి చెందిన చవ్వ శ్రీనివాసులు సవ్వ వెంకటసుబ్బమ్మల దంపతుల కుమారుడు చవ్వా శివకుమార్ మెడిసిన్ సీటు సాధించడంతో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ధనుంజయుడు శివకుమార్‌ను అభినందించారు. ఆదివారం వెలగటూరు గ్రామంలో శివకుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నారబోయిన తిమ్మరాజు, చవ్వ పుల్లయ్య పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న టీడీపీ నాయకుడు

జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న జిల్లా కార్యదర్శి, హెచ్ఎం

చాగలమర్రి, సెప్టెంబరు 22: చాగలమర్రి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జిల్లా స్థాయి సీనియర్ హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు ఆదివారం ఇన్‌చార్జి హెచ్ఎం శ్రీనివాసులు, జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి వై.మహబూబ్‌బాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 40 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారని అన్నారు. హ్యాండ్‌బాల్‌లో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని అన్నారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు 9, 10 తేదీల్లో చాగలమర్రిలో జరిగే 53వ సీనియర్ మెన్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో నంద్యాల జిల్లా జట్టుకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు రవింద్రారెడ్డి, పీడీలు దాదాపీర్, షేక్షావలి, జిల్లా హ్యాండ్‌బాల్ సహాయ కార్యదర్శి కె.మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

చాగలమర్రి, సెప్టెంబరు 22: మత్తు పదార్థాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని హెచ్ఎం కోటయ్య తెలిపారు. చాగలమర్రి బాలుర ఉన్నత పాఠశాలలో మన బ్లెడ్ డోనర్స్, అనాధ రక్షకసేవ ఫౌండేషన్, సహార సోషల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై యువత, విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శాస్త్రీ, రవింద్రారెడ్డి, మహబూబ్‌బాషా, శివశంకర్, శ్రీనివాసులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మహమ్మద్‌రఫి, సాయిసుదర్శన్, ఉసేన్‌బీలాల్ పాల్గొన్నారు.



మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

అహోబిలంలో నవరాత్రి ఉత్సవాలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), సెప్టెంబరు 22: ఆళ్లగడ్డ మండలంలో ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో అక్టోబరు 3వ తేదీ నుంచి 12 వరకు దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు మఠం నిర్వాహకులు ఆదివారం తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ ఉదయం తిరుమంజనం నిర్వహిస్తామన్నారు. 8వ తేదీన మొదటి పీఠాధిపతి ఆదివన్ శఠగోపన్ యతీంద్ర మహాదేశికన్ జయంతి వేడుకలు, 12న విజయదశమి పర్వదినాన జమ్మిచెట్టు ఉత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించకూడదు

శిరివెళ్ల, సెప్టెంబరు 22 : గ్రామాల్లోని ప్రజల ప్రశాంతతకు రౌడీషీటర్లు భంగం కలిగించకూడదని.. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆళ్లగడ్డ డీఎస్పీ రవి కుమార్ హెచ్చరించారు. శిరివెళ్లలోని పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. క్షణికావేశానికి లోనై చేసే తప్పుల వల్ల కేసుల్లో ఇరుక్కుని జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో శిరివెళ్ల సర్కిల్ సీఐ వంశీధర్, ఎస్‌ఐ చిన్న పీరయ్య పాల్గొన్నారు.



శిరివెళ్లలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎస్పీ రవి కుమార్

బేతంచెర్ల: గ్రామాల్లో ప్రజలు శాంతికి భంగం కలిగించకుండా సమాజంలోని ప్రజలతో కలిసిపోయి ప్రశాంత జీవనాన్ని కొనసాగించాలని సీఐ వెంకటేశ్వరరావు రౌడీషీటర్లకు సూచించారు. ఆదివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ప్రాంగణంలో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రౌడీషీటర్లకు ఆయన కౌన్సిలింగ్ నిర్వహించారు.

అన్ని వర్గాలకు న్యాయం

శిరివెళ్ల, సెప్టెంబరు 22 : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేయడమే ప్రభుత్వ ధ్యేయమని టీడీపీ మండల కన్వీనర్, మాజీ ఎంపీపీ కాటంరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులైన సందర్భంగా ప్రజలకు అందించిన సంక్షేమాన్ని వివరించేందుకు మండల కేంద్రమైన శిరివెళ్లలోని షాదిఖానా భవనంలో సోమవారం సాయంత్రం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఆళ్లగడ్డ నియోజకవర్గ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరు కావాలని శ్రీకాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

చెరువులకు నీళ్లు నింపండి

- మంత్రి నిమ్మలకు వినతి

డోన్, సెప్టెంబరు 22: డోన్ నియోజకవర్గంలో చెరువులకు నీళ్లు నింపాలని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్ కోరారు. ఆదివారం కర్నూలు నగరంలో మంత్రి నిమ్మలను కలిసి పూలబొకేను అందజేసి వై.నాగేశ్వరరావు యాదవ్ సన్మానించారు. హంద్రీనీవా ప్రాజెక్టు నుంచి నీళ్లను డోన్ నియోజకవర్గంలోని చెరువులకు నింపి రైతులను ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. చెరువులకు నీళ్లు నింపడం ద్వారా రైతులకు సాగునీటితో పాటు ప్రజలకు తాగునీరు అవసరాలు అందడంతో పాటు ప్రజల అవపరాలు తీరుతాయన్నారు.



మంత్రి నిమ్మలను సన్మానిస్తున్న వై.నాగేశ్వరరావు యాదవ్

వృద్ధులకు దుస్తుల పంపిణీ

డోన్(రూరల్), సెప్టెంబరు 22: మండలంలోని ఓబులాపురం గ్రామ సమీపంలో ఉన్న కాశిరెడ్డి నాయన ఓబుల్‌రెడ్డి దంపతులు వృద్ధాశ్రమంలో దుస్తులను అందజేశారు. డోన్ పట్టణానికి చెందిన సాధనగిరి రామిరెడ్డి, రంగమ్మ జ్ఞాపకార్థం సాధనగిరి ఓబుల్ రెడ్డి జయమ్మ దంపతులు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో సాధనగిరి రామకృష్ణ, శ్రీకాంత్‌లు ఉన్నారు.

వరద బాధితులకు సహాయం

డోన్(రూరల్), సెప్టెంబరు 22: విజయవాడలో ఇటీవల వచ్చిన వరదలకు తీవ్రంగా నష్టపోయిన బాధితులకు గ్రామీణ వైద్యులు ఆర్థిక సాయం అందజేసినట్లు ఆర్ఎంపీ డాక్టర్ల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు అన్నారు. డోన్ ప్రాంతం నుంచి రూ.17వేల నగదును నంద్యాల జిల్లా తరపున రూ.3.60లక్షల నగదును, రూ.3.60 లక్షల నిత్యావసరాల సరుకులను గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో అందజేసినట్లు వెంకటేశ్వర్లు తెలిపారు.

ఏపీ వాల్మీకి, బోయ సంఘం పట్టణ అధ్యక్షుడిగా బోయ శివ

డోన్(రూరల్), సెప్టెంబరు 22: ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం పట్టణ అధ్యక్షులుగా బోయ శివ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం కర్నూలులో జరిగిన ఆంధ్రప్రదేశ్ వాల్మీకి బోయ సంఘం వర్క్‌షాపు అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. డోన్ పట్టణానికి చెందిన బోయ శివను పట్టణ అధ్యక్షుడిగా ఎన్నుకోవడం పట్ల ఆంధ్రప్రదేశ్ వాల్మీకిబోయ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లబోతుల సురేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిలేటి హర్షం వ్యక్తం చేశారు.



బోయ శివకు నియామక పత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర కమిటీ నాయకులు

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

బేతంచెర్ల, సెప్టెంబరు 22: మండలంలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో స్థానికంగా ఒంటరిగా జీవిస్తున్న వెంకటగోపాలాచారి (70) అనే అనాథ మృతి చెందాడు. ఆయన మృతదేహానికి ఆదివారం ఆ నలుగురు స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు వన్నూరు భాషా ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. కార్యక్రమంలో అక్బర్, వెంకటేశ్వర్లు, గంగాధర్ పాల్గొన్నారు.

